కథా కౌముది



# విధిలిఖితం పంతుల వేణు గోపాలరావు

ఆదివారం మధ్యాహ్నం. సమయం రెండు కావస్తోంది. ఆయన్ని భోజనానికి పిలవాలిక అనుకుంటూ "నాన్నని అన్నానికి పిలువు" అని కూతుర్ని పురమాయించింది రాధ.

సాధారణంగా ఒంటిగంటయ్యేసరికి డైనింగ్ టేబుల్ దగ్గర తచ్చాడే గోపాలం ఆదివారం మాత్రం రెండు వరకూ భోజనం వద్దంటాడు. మిగతా రోజుల్లో ఉదయం ఎనిమిదిన్నర కల్లా టిఫిన్ ముగించి ఆఫీసుకి బయలుదేరతాడు. మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు వరకు లంచ్ టైమ్. ఆఫీస్ దగ్గర లోనే కాబట్టి ఠంచనుగా ఒంటిగంటకి యింటికొచ్చేస్తాడు. "కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయోయ్, రా భోంచేసేద్దాం" అంటూ మరో పని ముట్టనివ్వడు. తనకీ అలవాటయిపోవడంతో ఆయనొచ్చేసరికల్లా డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధం చేసి వుంచుతుంది రాధ. ఆదివారం నాడు మాత్రం టైం టేబుల్ మారుతుంది. ఉదయం టిఫిన్లయ్యేసరికి పదీ, పదిన్నర కూడా ఐపోతుంది. అంచేత భోజనం రెండుకి ముందెప్పుడూ లేదు.

"అమ్మా! నాన్న కుర్చీలో పడుకున్నారు. మళ్ళీ తిడతారేమోనని లేపలేదు" కూతురలా వచ్చి చెప్పేసరికి గుండె జారిపోయింది రాధకి. ఈ వేళప్పుడు అలా ఎప్పుడూ పడుకోరే! ఏమయ్యిందోనని కంగారుగా గోపాలం గదివైపు పరుగెత్తింది.

అగర్వాల్ చిట్ ఫండ్స్ ఆఫీసు లో అకౌంటెంట్ గా పనిచేస్తున్న గోపాలం పిత్రార్జితమైన ఆ యింటినే అన్నలకి వారి వాటా డబ్బు చెల్లించి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటికే ఆ యిల్లు పాడుబడడంతో రిపేర్లు చేయించి ముందు నొక గదీ, డాబా మీద మరో గదీ కొత్తగా కట్టించాడు. ముందు గదిని డ్రాయింగ్ రూమ్ గా వాడుతూ

అందులోనుండే డాబా మీది గదిలోకి చేరేలా మెట్లు కట్టించాడు. ఆ గది తన ఆఫీస్ రూమ్. పిల్లలే కాదు, ఆ గదిలోకి వెళ్ళేందుకు రాధ కూడా సంకోచిస్తుంది.

గబగబా మెట్లెక్కి గోపాలం గదిలోకి వెళ్ళింది రాధ. కాళ్ళు రెండూ ఎదర టేబుల్ మీద పెట్టుకుని కుర్చీలో వెనక్కి చేరబడి వున్నాడు. కిటికీ లోనుండి బయటకు చూస్తూ అచేతనంగా వున్నాడు. ఆ చూపులో కళ లేదు.

గోపాలాన్ని అలాగ చూసేసరికి రాధకి చాలా భయమేసింది.

ఉదయం పదింటికి పిల్లలతో కూచుని టిఫిన్ చేసారు. తరువాత తననడిగి కూరలేమేం కావాలో లిస్ట్ వ్రాసుకుని మార్కెట్ కెళ్ళొచ్చారు. ఆ కూరలన్నీ శుభ్రం చేసి ఫ్రిజ్ లో సర్దుతుండగా రమణ బాబాయ్ వచ్చారు.

ఆ వీధిలోనే నాలుగిళ్ళ అవతల వుండే రమణమూర్తి గోపాలం తండ్రికి స్నేహితుడు. పదేళ్ల క్రితం తండ్రిని కోల్పోయిన గోపాలం కుటుంబానికి ఆయనే పెద్ద దిక్కు. బాబాయ్ వస్తూనే "ఇదిగోరా గోపాలం" అంటూ ఆయన చేతిలో ఓ కవరు పెట్టారు. ఇద్దరూ కలిసి డాబా మీది గదిలోకి వెళ్ళిపోయారు!

పన్నెండవుతుండగా క్రిందికి వచ్చిన బాబాయ్ "నేనొస్తానమ్మా" అంటూ "కాఫీ తాగి వెళుదురు, వుండండి" అన్నా వద్దంటూ వెళ్లిపోయారు.

"ఏమండీ, ఏవఁడీ" అంటూ భర్తని పట్టుకు కుదిపింది రాధ. మెల్లగా యీ లోకంలోకి వచ్చిన గోపాలం బేలగా రాధ కళ్ళలోకి చూసాడు. కాస్తంత కుదుటపడ్డ రాధ అతని ప్రక్కనే మరో కుర్చీలో కూర్చొని "ఏమయ్యిందండీ. బాబాయిగారితో యేదన్నా సమస్యనా?" అడిగింది రాధ.

"ఛ.ఛ! అదేంలేదు!" అంటున్న గోపాలానికి యేడుపు తన్నుకొచ్చింది. గోపాలం అలా ఏడవడం రాధ యెప్పుడూ చూళ్ళేదు. ఏడాది క్రిందట తనకెంతో ప్రాణమైన తల్లి మరణం కూడా ఆయనని ఏడ్పించలేదు. బొంబాయి లోనూ, హైదరాబాదులోనూ యేవో చిన్న వుద్యోగాలు చేస్తూ స్థిరపడిన అన్నలిద్దరూ వచ్చే వరకు తల్లి పార్థివ దేహాన్ని ఐస్ బాక్స్ లో కాపాడుతూ యెంతో బాధ్యతగానూ, గుంభనంగానూ వుంటూ తననీ పిల్లల్నీ అనునయించి ధైర్యం చెప్పారు!

"సరే, కొంచెం కుదుటపడండి ముందు" భర్త చేతులని తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా వత్తుతూ అంది.

టేబిల్ మీద బాటిల్లోని నీరు కొద్దిగా గ్లాసు లోకి పోసి చేతికిచ్చి "కొంచెం నోరు తడుపుకోండి" అంది.

"రాధా. నిన్న రాత్రి యెవరో తలుపులు దబదబా బాదారు కదా!" భర్త చెప్తుంటే అవునని తలూపింది రాధ. "తలుపులు బాదుతూ గోపీ, గోపీ అంటూ అరిచింది మా శ్రీనుగాడే" చెప్తున్న గోపాలం గొంతు గద్గదమైంది.

రాత్రి సంఘటన గుర్తుకు తెచ్చుకుంది రాధ. రాత్రి రెండవుతుందేమో, ఎవరో వచ్చి తలుపులు దబదబా బాదుతున్నారు. కాలింగ్ బెల్ నొక్కకుండా యింత రాత్రిపూట యెవరా అని ఆశ్చర్యంతో లేవబోతుంటే వద్దని వారించారు.

"గోపీ అని మీ పేరు పెట్టి పిలుస్తున్నారు కదండీ, తెలిసిన వాళ్ళేనేమో" అంటే

" అవును, కానీ వేళకానివేళ బాగా తాగి వచ్చినట్టున్నాడు. వచ్చి పడుకో!" అన్నారు. అలా ఓ పదినిమిషాల పాటు ఆగి ఆగి తలుపు కొట్టిన మనిషి ఆ తర్వాత యెటో వెళ్ళిపోయినట్టున్నాడు.

"వాడు మా శ్రీను గాడే రాధా. చివరిసారి నన్ను కలుద్దామని వచ్చాడట. రాత్రి వాడెంత పిలిచినా నేను లేవలేదు. నిన్నూ వారించాను."

ఆగి కొంచెం నీరు తాగి మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు గోపాలం.

"నీకు శ్రీను గుర్తున్నాడా" అన్న ప్రశ్నకి "అవునండీ, మన పెళ్ళికి వచ్చాడు అన్నారు. మళ్ళీ గత నెలలో వచ్చారు కదా! మీరేదో డబ్బు సాయం చేసానన్నారు"

రాధ మాటలకడ్డుపడుతూ " ఆ డబ్బు పది వేలూ తిరిగి యిద్దామనే వచ్చాడట. మనం యెంతకీ తలుపు తీయకుంటే రమణ బాబాయి గారిని లేపి ఆయనకి సొమ్మిచ్చి, నాకిమ్మని చెప్పి వెళిపోయాడట. అందులో యీ కాగితం కూడా వుందట" అంటూ ఆ కాగితాన్ని రాధ చేతిలో పెట్టాడు.

కాగితం మడతలు విప్పి చూసింది రాధ. అందులో యేదో వ్రాసి వుంది. దాన్ని వెలుతురు వైపు తిప్పి చదివింది. "గోపీ, నిన్ను చూడాలనిపించింది. నువ్వు యెందుకో నన్ను చూడ్డానికి యిష్టపడలేదు. సరే. థాంక్యూ ఫర్ హెల్ప్. థాంక్యూ ఫర్ ఎవ్రీ థింగ్".

చదివి కాగితాన్ని మడిచి టేబుల్ మీద పెట్టింది. కాస్సేపు వాళ్ళిద్దరి మధ్యా నిశ్శబ్దం ఆవరించింది.

గోపాలం చిన్ననాటి జ్ఞాపకాలలోకి వెళ్ళిపోయాడు.

తను పుట్టి పెరిగినదా వూళ్ళోనే. పదో తరగతి వరకు తనతో చదువుకున్న తన యీడు వాళ్ళు మరో యిద్దరున్నారు ఆ వీధిలో. బ్రిజేష్ వాళ్ళు మార్వాడీలు. వాడు ఎంతకీ పది పాసవ్వలేక చదువాపేసి వాళ్ళ నాన్న చేసే బట్టల వ్యాపారంలో చేరిపోయాడు.

మూర్తి మాస్టారి పెద్దకొడుకు

శ్రీనివాస్ తనతోనే జూనియర్ కాలేజిలో చేరాడు. తాను ఎం.పి.సి. అయితే శ్రీను హెచ్.యి.సి. గ్రూప్ తీసుకున్నాడు.

పదవ తరగతి వరకు లేచింది మొదలు పడుకునే దాకా చదువైనా, ఆటలయినా కలిసే తిరిగిన ముగ్గురూ ఆ రెండేళ్ళలో నెలకోసారి కలవడం కూడా కష్టమయ్యేది.

కాలేజీ కల్చరల్ యాక్టివిటీస్ లో, గేమ్స్ లో పాల్గొనేటప్పుడు శ్రీను తన వెన్నంటే వుండేవాడు. వాడు పాల్గొనకపోయినా తనని బాగా ప్రోత్సహించేవాడు.

అందరూ తమని రామలక్ష్మణులనేవారు.

తమ ఫస్టియర్ పరీక్షలప్పుడు

శ్రీనివాస్ తండ్రి సత్యమూర్తిగారు కాలం చేసారు. అది వాడిని మరి కోలుకోలేకుండా చేసింది.

అంతవరకు వాళ్ళ కుటుంబం తో ఎంతో ప్రేమలొలకపోస్తూ వచ్చిపోయే నాన్న తరఫు బంధువులు దూరమైపోయారు. కులాంతర వివాహం కావడంతో తల్లి తరుపున బంధువులెవ్వరూ లేరు.

వారికి సహాయం చేద్దామని ముందుకొచ్చిన తెలుగు మాస్టారితో ఆ యిల్లాలికి అక్రమ సంబంధం అంటగట్టి ఆయననూ రానీయకుండా చేసారు. మరో ఆర్నెల్ల వ్యవధిలో తన తండ్రి కూడా పోయినా వీధిలోని వారంతా తమ వెంట నిలిచారు.

మాస్టారు ప్రైవేటు స్కూల్లో పని చేయడం వల్ల పెన్షన్ సదుపాయం లేదు. ఇన్సూరెన్స్ పాలసీ కూడా చిన్నదే అవడంతో వచ్చిన డబ్బులు హాస్పిటల్ బిల్లులు, పచారీ కొట్లో బాకీలు, దశదిన కర్మ వరకూ అయ్యే ఖర్చులకే సరిపోలేదట. శ్రీను ఫస్టియర్ తోనే చదువాపేసి ప్రైవేటు బస్సుల్లో క్లీనర్ గా చేరి తమ్ముడి చదువు ఆగిపోకుండా చూసుకున్నాడు.

"శ్రీనివాస్ గారు తెలివయిన వారు, బాధ్యతగా తల్లినీ తమ్ముణ్ణి చూసుకున్నారని చెప్పారు కదండీ. ఎలా తాగుడికి బానిసయ్యారు"

రాధ ప్రశ్నకి జవాబు చెప్పేముందు గాఢంగా నిట్టూర్చాడు గోపాలం.

"మొదట్లో బాగానే వుండేవాడు. నేను ఇంటరయ్యాక యిక్కడ డిగ్రీ కాలేజి లేకపోవడం వల్ల అన్నయ్య దగ్గరికి హైదరాబాదు వెళ్ళిపోయాను. నాన్ లోకల్ అవడంతో బియస్సీలో సీటురాక కామర్స్ లో జాయినయ్యాను.

అక్కడ డిగ్రీ అవగానే ఓ ఫైనాన్స్ కంపెనీలో వుద్యోగం లో చేరాను. మరో యేడాదికే మన పెళ్ళి. అమ్మ చివరి రోజులలో స్వంత యింటిలో గడపాలని పట్టుపట్టడంతో యిక్కడికి వచ్చేసాము కదా."

మళ్ళీ వోసారి దీర్ఘంగా నిట్టూర్చి చెప్పడం మొదలెట్టాడు.

" ఇన్నేళ్లు వూరికి దూరంగా వుండడం వల్ల యిక్కడి విషయాలేవీ తెలియలేదు. ఇంటి అద్దె వసూలు చెయ్యడం, రిపేర్లు, టాక్సులు కట్టడం అన్నీ బాబాయ్ గారే చూడబట్టి మాకెవరికీ యిటు వచ్చే పనీ, వద్దామన్నా తీరికా వుండేదికాదు. మనమిక్కడికి వచ్చాక కూడా కొత్త వుద్యోగం, యింటి పనులూ, చంటాడు పుట్టడం వీటన్నిటితో స్నేహితుల ఆలోచనే రాలేదు."

అంతవరకు తన చిన్ననాటి జ్ఞాపకాలను చెబుతూంటే గోపాలం గొంతు లోని మార్దవ్యం స్పష్టంగా వినపడింది. చంటి పిల్లాడిలా కనిపించాడు.

అంతలోనే అతని గొంతు జీరపోయింది.

కళ్ళల్లో నీటి పొరలు కమ్ముకున్నాయి.

“ రెణ్ణెళ్ళవుతుందనుకుంటా. బ్రిజేష్ కలిసాడు. మాటల్లో వీడి ప్రస్తావన వస్తే కట్ చేసేసాడు. వాడు మన శీనుగాడు కాదురా. వాడికెంత దూరంగా వుంటే అంత మంచిది అన్చెప్పి మళ్ళా కలుస్తానని వెళ్ళిపోయాడు. “

టేబుల్ మీద గ్లాసు తీసుకొని కొంచెం నీరు త్రాగి గొంతు సవరించుకున్నాడు గోపాలం.

గోపాలాన్ని అలా మాట్లాడనిస్తే మనసులోని బాధ బయటకొచ్చి తను తేరుకుంటాడని రాధకు తెలుసు. అందుకే ఆసక్తితో వింటున్నానని "ఊఁ" కొడుతూ భర్త వైపే చూస్తోంది, చెప్పండన్నట్లుగా.

"బ్రిజేష్ మాటలు విన్నాక నా మనసు మనసులో లేదు. శ్రీను ని కలుద్దామని వాళ్ళింటికెళ్ళాను. నన్ను చూసి యింట్లోంచి వచ్చిన అమ్మాయి చెప్పింది శ్రీను అక్కడ వుండడం లేదని. ఆమె శ్రీను తమ్ముడు శంకరం భార్యట. వాళ్ళాయన ఆర్టీసీ లో వుద్యోగం చేస్తున్నాడని చెప్పింది. వాళ్ళత్తగారు పోయాక అన్నయ్యతో కలిసుండడం యిష్టం లేక యిల్లమ్మేద్దామంటే, వద్దు మీరిందులోనే వుండండని తను బయటకెళ్ళిపోయాడని చెప్పింది."

తండ్రి తరువాత తండ్రిలాగా చూసుకుని తనని చదివించిన అన్నని వెళ్ళగొట్టిన ఆ తమ్ముడి మీద చాలా కోపమొచ్చింది రాధకి. శ్రీనివాస్ మెతకతనాన్ని కూడా యాక్సెప్ట్ చెయ్యలేకపోయింది.

"వాళ్ళనే బయటకు పంపేయాల్సింది. వాడి బాగుకోసం కాదూ ఈయన చదువుమానేసి మోటార్ ఫీల్డ్ లో చేరిందీ"

రాధ మాటలకి తల అడ్డంగా వూపుతూ "అలాగైతే వాడు మా శ్రీనుగాడెందుకవుతాడు. వాడక్కడ లేడని తెలిసాక వాకబు చేస్తే వూరి శివార్లలో ఆ తండా వాళ్ళుండే చోట ఓ షెడ్డులో వుంటున్నాడని తెల్సింది. వెళ్ళి కలిసాను. ఆరోగ్యం బాగా పాడయిపోయింది. వాణ్ణి ఆ షెడ్డులో అలా చూసి నా కడుపులో దేవేసింది."

మళ్ళీ కాసిన్ని నీళ్ళు తాగి కంటిన్యూ చేసాడు.

" బస్సుల జాతీయాకరణతో తను లారీలలో క్లీనరుగా తిరగాల్సి వచ్చిందట. అప్పుడే తాగుడు కొద్దిగా అలవాటయ్యిందనీ, తమ్ముడి ప్రవర్తనతో అది యింకా ఎక్కువయ్యిందనీ చెప్పాడు.

నేను వచ్చాక నా సంగతులన్నీ తెలుస్తున్నా, తన పరిస్థితి నాకు తెలియకూడదనే రాలేదట. నేను వాణ్ణి మందలించి, వొప్పించి మనింటికి తీసుకొచ్చాను. వాడికి ప్రభుత్వం నుండి చిన్న వ్యాపారానికి లోన్ వస్తుందని తెలిసి ముందస్తు పెట్టుబడి కోసం నావంతుగా ఓ పదివేలిచ్చాను.

అది తీసుకోమని వొప్పించడానికి తలప్రాణం తోక కొచ్చింది. డబ్బిచ్చి వాడిని తాగుడు మానమని వొట్టేయించుకున్నాను."

ఆగి శ్వాస తీసుకున్నాడు గోపాలం. దుఃఖం పొర్లుకొచ్చింది.

"బాబాయి చెప్పారు. వాడికి వంట్లో బాగా లేకపోతే డాక్టర్ కి చూపించుకోడానికి వెళ్ళాడట. తనకి కాన్సర్ సోకిందనీ బాగా ముదిరిపోయి వుండవచ్చనీ చెప్పి, యేవేవో టెస్టులకోసం పదివేలడిగారట!" మరి కొనసాగించ లేక వెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

రాధ లేచి నిలబడి గోపాలాన్ని హత్తుకుని తల నిమురుతూ ఓదార్చింది.

"తన వ్యాధి తగ్గేది కాదనీ, లక్షల్లో ఖర్చు పెట్టేందుకు స్తోమత కూడా లేదనీ చచ్చిపోదామని నిర్ణయించుకున్నాడు.

నా దగ్గర తీసుకున్న సొమ్ముకి తక్కువ పడ్డ డబ్బులు బస్టాండులో, మార్కెట్లో , లేని ఓపిక తెచ్చుకుని పనిచేసి పదివేలూ జమచేసి, రాత్రి వాడిక్కడికి వచ్చాడు. ఒట్టువేసి కూడా మళ్ళీ తాగి వచ్చాడని నేనే మూర్ఖత్వంతో వాణ్ణి రానివ్వకుండా వాడి చావుకి కారణమయ్యాను.

తలుపు తీసి వాడితో మాట్లాడి వుంటే నన్ను కాదనే వాడు కాదు. తెల్లారి చెరువులో శవమై తేలేడు. ఈ పాపం నాదే." బావురుమన్నాడు గోపాలం.

"అంతా విధిలిఖితం. మీరు చెయ్యగల్సినంతా చేసారు" అంటూ ఓదార్పు మాటగా అన్నా సరే

గోపాలాన్ని ఆపడం రాధ తరం కాలేదు. కళ్ళు ఎర్రబారి ముఖం వాచిపోయింది. తన మూర్ఖత్వం వల్లనే చిన్ననాటి స్నేహితుడి ప్రాణం నిలబెట్టలేక పోయాననే మనోవేదన జీవితాంతం గోపాలాన్ని వెంటాడుతూనే వుంది.

@@@###@@@

COMMENTS